క్లుప్తంగా

కోలుకోలేక యువకుడి మృతి

తుగ్గలి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈ నెల 18న రాతన వద్ద ఆటో అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లు మండలానికి చెందిన ఆంజనేయులు (24) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కేంద్ర బలగాల కవాతు



నందవరంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసులు

నందవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని ఎస్‌ఐ తిమ్మయ్య కోరారు. మంగళవారం నందవరంతో పాటు ముగతి గ్రామంలోని గ్రామంలోని అన్ని వీధుల్లో కేంద్ర బలగాలతో కలిసి ఎస్‌ఐ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమసాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రథోత్సవానికి ఏర్పాట్లు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తేరు బజారు నందు గ్రావెల్ మట్టి రోడ్డు పనులు చేయించినట్లు సర్పంచ్ మల్లికార్జున మంగళవారం తెలిపారు. గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రథోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో రోడ్డుపై గుంతలను పూడ్చి బాగు చేయించినట్లు చెప్పారు. అలాగే నీటి సమస్య తలెత్తకుండా ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజు స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో పారా సేవా సమితి సభ్యులు రామచంద్ర ప్రసాద్, విశ్వనాథ్ కుటుంబసభ్యులు మంగళవారం 200 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఏటా గ్రామంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. దాతల కుటుంబసభ్యులు జయవర్ధన్, సంధ్యారాణి, సమితి సభ్యులు వలి, పక్కీరప్ప, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుని హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో సిబ్బంది, గ్రామస్తులు స్వామివారికి కానుకల రూపంలో వచ్చిన నగదును లెక్కించగా రూ.12.51 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. పర్యవేక్షణ అధికారి సుబ్బరాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరంగడు, మాజీ చైర్మన్ తలారి రాఘవేంద్ర, సిబ్బంది శ్రీనివాసులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

28న తాత్కాలిక హుండీ ఆదాయం లెక్కింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఈ నెల 28న తాత్కాలిక హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు నిబంధనల మేరకు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏపీటీఎఫ్ వెల్దుర్తి మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాగమద్దయ్య, గౌరవాధ్యక్షుడిగా రాజేష్, అదనపు కార్యదర్శిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా నాగమణి, శ్రీనివాసులు, సదర్శన్ రెడ్డి, కార్యదర్శులుగా సోమన్న, కృష్ణమూర్తి, వెంకటరమణారెడ్డి, 15 మందిని జిల్లా కౌన్సిలర్లుగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం



వీవర్స్ కాలనీలో దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఆమె మంగళవారం పట్టణంలోని 26వ వార్డులో కౌన్సిలర్ నీలకంఠ, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. ఆమె మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలిస్తామంటూ మభ్యపెట్టి మోసగించేందుకు వస్తున్నారని వారిని నమ్మవద్దని ఓటర్లకు సూచించారు. సీఎం జగనన్న నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ ఫలాలు ఐదేళ్లలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు అందించారన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంతో టీడీపీ ప్రభుత్వాన్ని నాడు ప్రజలు ఇంటికి పంపారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికలొచ్చాయని మళ్లీ కల్లబొల్లి హామీలు గుప్పించిన టీడీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ వస్తే సంక్షేమ పథకాలు అమలు కావన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, నాయకులు రియాజ్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, సునీల్‌కుమార్, రాజారత్నం, అమాన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం పార్టీ శ్రేణులు కృషిచేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక సూచించారు. మండల పరిధిలోని కడివెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ ఆయన సోదరుడు శ్రీనివాసులుతో పాటు 200 మంది మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుట్టా రేణుకను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి సత్కరించారు. ఆమె మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా గ్రామీణులను చైతన్య పరచాలని వారికి సూచించారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు



నందవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి చిరంజీవి

నందవరం: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా విలువైనదని, ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించి ఓటు..నీ భవిత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియచేయడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఓటు వేయడం అందరి బాధ్యతయని, ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం తమ బాధ్యతయని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు వేయడానికి అర్హులన్నారు. అర్హత కలిగిన ఎవరికైనా ఓటుహక్కు లేకపోతే ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎస్‌ఐ తిమ్మయ్య, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే సుభిక్ష పాలన



ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగనన్నతోనే రాష్ట్రంలో సుభిక్షపాలన కొనసాగుతుందని, సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ విజయం అందించాలని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు బుట్టా ప్రతుల్ ఓటర్లను కోరారు. ఆయన మంగళవారం పట్టణంలోని 34వ వార్డులో ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రమేష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి తన తల్లి బుట్టా రేణుకను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమౌతుందని టీడీపీని నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్ర కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు కోటకొండ నరసింహులు, కె.విశ్వనాథ్, వడ్డె వీరేష్, సచివాలయ కన్వీనర్లు మధు, శ్రీనివాసులు, బద్రి, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలని పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారిణి నీలపు రామలక్ష్మి సూచించారు. మంగళవారం పత్తికొండ ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంపై తమకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. జనసంచారం ఉండే ప్రదేశాల్లో జెండాలు, పోస్టర్లు, బ్యానర్లు, గోడరాతలు ఉండరాదన్నారు. అనుమతి లేకుండా ప్రచార వాహనాలు తిప్పితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై చర్యలుంటాయన్నారు. అప్పటికప్పుడు దరఖాస్తు చేసుకుంటే అనుమతించబోమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలని కోరారు. అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగిసే వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఓటు హక్కు కలిగిన యువత సద్వినియోగం చేసుకునేలా చైతన్యవంతం చేయాలని కోరారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



అధ్యక్షుడు వాయుజీవోత్తమరావు

ఆలూరు రూరల్: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు బార్ అండ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వాయుజీవోత్తమరావు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి సిద్దప్ప తెలిపారు. అధ్యక్షుడి స్థానానికి రెండు నామినేషన్లు దాఖలు కాగా అందులో ఒకరు ఉపసంహరించుకోవడంతో వాయుజీవోత్తమరావు ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందన్నారు. అలాగే కార్యదర్శిగా షేక్షావలి, కోశాధికారిగా షాకీర్, సహాయ కార్యదర్శిగా ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడిగా కృష్ణకుమార్, గ్రంథాలయ సభ్యుడిగా మోహన్ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి సిద్దప్ప ప్రకటించారు. ఎన్నికైన వారిని బార్ అసోసియేషన్ సభ్యులు మాధవ కృష్ణ, రవి, వీరేష్, రాజేష్ నాయుడు, చాంద్ బాషా తదితరులు సన్మానించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మద్దిలింగదహాళ్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. ఆయన మంగళవారం మద్దిలింగదహళ్లి, పెద్దగోనెహాళ్ గ్రామాలలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. కక్షలు, కార్పణ్యాలకు పోకుండా గ్రామం అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకుని ప్రశాంత వాతావరణం ఏర్పడేలా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని మన్నెకుంట, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో మంగళవారం రాత్రి ఆయన గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. ఎన్నికల వేళ ఎవరైనా అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే రహదారి ప్రమాదాలు, బాలిక చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

దేవనకొండ: ఈనెల 29వ తేదీన ఎమ్మిగనూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టనున్న 'మేమంతా సిద్ధం' సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బుసినె వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గుమ్మరాళ్ల, బి.సెంటర్, ఓబుళాపురం, నెల్లిబండ, పాలకుర్తి, బండగట్టు, జిల్లెడబుడకల గ్రామాల్లో ఆయన పర్యటించారు. 'మేమంతా సిద్ధం' సభను విజయవంతం చేయడంపై పార్టీ నాయకులతో చర్చించారు. పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆలూరు రూరల్: సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు హత్తిబెళగల్ గ్రామ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత ఫిబ్రవరిలో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మానస, నూర్జహాన్ ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వారు బుధవారం కర్ణాటక రాష్ట్రం దావణగేరిలో జరిగే జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆ విద్యార్థినులను గ్రామస్తులు, పీఈటీ చిన్నబాబు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దేవనకొండ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామాంజనేయులు భార్య సువర్ణ బిడ్డను ప్రసవించి కోలుకోలేక మృత్యువాత పడ్డారు. వివరాలు.. రామాంజనేయులుకు దేవనకొండకు చెందిన సువర్ణతో 15 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. మొదటి సంతానం కుమార్తె జన్మించగా తర్వాత 13 ఏళ్లకు రెండోసారి గర్భం దాల్చింది. ప్రసవం నిమిత్తం ఆదివారం కర్నూలు సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి ఆరోగ్యం విషమించడంతో కోలుకోలేక మృతి చెందింది. పాప ఆరోగ్యంగా ఉన్నా కన్నతల్లి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు బసినె వెంకటేష్ మంగళవారం ఆ కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ముస్లింలకు ఎస్‌ఐ ఇస్తార్ విందు



వెల్దుర్తి జామీయా మసీదులో ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): రంజాన్ మాసం పురస్కరించుకుని ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు వెల్దుర్తి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఇస్తార్ విందు ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఉపవాస దీక్ష విరమించిన సందర్భంగా వెల్దుర్తి జామీయా మసీదు చేరుకుని సీఐ సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనార్టీ మండల కన్వీనర్ గట్టు ఆరీఫ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణం



చిప్పగిరిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

చిప్పగిరి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలో జగనన్న కాలనీలో చేపట్టిన గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. మండలంలో మొత్తం 743 గృహాలు మంజూరుకాగా ఇప్పటివరకు 220 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా వాటిలో బిలో బేస్‌మెంట్ లెవల్ – 220, రూఫ్ లెవల్ – 33 ఇలా వివిధ దశలలో నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నట్లు హౌసింగ్ ఏఈ భవ్య తెలిపారు. నిర్మాణాల పురోగతిని బట్టి సత్వరమే బిల్లులు మంజూరవుతున్నట్లు వారు తెలిపారు.

బీసీపై చర్యలు తీసుకోవాలి

ఆస్పరి: ఆస్పరి ఏపీజీబీ తరఫున ముత్తుకూరు గ్రామానికి బిజినెస్ కరెస్పాండెంట్ (బీసీ)గా పని చేస్తున్న శంకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం సీపీఐ నాయకులు బ్యాంకు ఎదుట దర్నా చేపట్టారు. సీపీఐ నాయకులు నాగేంద్రయ్య, రమేష్ మాట్లాడుతూ.. ముత్తుకూరు గ్రామ బీసీగా పనిచేస్తున్న శంకర్‌రెడ్డి అమాయకులను అసరా చేసుకుని వారి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. బీసీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీజీబీ మేనేజర్ వంశీకృష్ణ, ఆస్పరి సీఐ హనుమంతప్పకు వినతి పత్రం ఇచ్చారు.



ఆలూరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ఆలూరు: ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి జిహాదీ టెర్రరిస్టులుగా పోల్చడం దారుణమని ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ ఈరన్న సమక్షంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు బుసినె శ్రీరాములు, పార్టీ సంయుక్త కార్యదర్శి జనార్ధన్‌నాయుడు చిప్పగిరి, ఆలూరు మండల కన్వీనర్లు మారయ్య, షఫివుల్లా, శ్రీనివాసులు, బీసీ మాదన్న, శేషప్ప, గిరి, మల్లికార్జున, తదితరులు మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. వారికి మరోసారి ఓటుతో బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి వలంటీర్లు అందించిన సేవలను మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్పరి సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు ఓబులేసు, లోకప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లింగమయ్య దేవర



ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గోనెగండ్ల: మండల పరిధిలోని వీరంపల్లి గ్రామంలో లింగమయ్య స్వామి దేవర మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పూర్ణకుంభాలు మేళతాళలతో ఊరేగింపుగా వచ్చి బలిదానం కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకలను తిలకించి మొక్కులు తీర్చుకున్నారు.

లింగమయ్య స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

దేవర సందర్భంగా మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, అలువాల ప్రమోద్‌కుమార్ రెడ్డి తదితరులు లింగమయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి గ్రామ నాయకులు ఘనస్వాగతం పలికి పూలమాలతో సన్మానించారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం



మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేసినట్లు మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సెబ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే పంపాలన్నారు. నిఘా పెంచి అక్రమ మద్యం తరలింపును కట్టడి చేయాలని కోసిగి, ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్ల సీఐలను ఆదేశించారు. మంత్రాలయం మండలం మాధవరం, బాపురం చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఎవరైనా కర్ణాటక మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, కర్నూలు డీటీఎఫ్ సీఐ నర్సారెడ్డి, సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై శ్రీరంగనాథుడు



గజేంద్రునిపై కొలువుదీరిన శ్రీవారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీ సేవ చేపట్టారు. రాత్రి శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజేంద్రుడిపై అధిష్టించారు. గజేంద్రుడు తన వీపుపై స్వామివారిని మోస్తూ భక్తులకు కనువిందు చేశారు. గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

పెరవలి గ్రామంలో బుధవారం ఉదయం శ్రీవారు, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం, సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ సురేందర్ రెడ్డి

దేవనకొండ: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని, టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని జిల్లా జేసీఎస్ కన్వీనర్ సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం దేవనకొండలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఐదేళ్లుగా మినిస్టర్ హోదాలో ఉన్న గుమ్మనూరు జయరాం ఏ రోజూ నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించలేదని ఆరోపించారు. స్వలాభం కోసమే అక్రమాలు, అన్యాయాలు చేసే వారికి పుట్టినిల్లైన టీడీపీలో చేరారని విమర్శించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందవరం: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని సోమలగూడూరులో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు విన్నవించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. నీటి ఎద్దడి నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం గ్రామంలో నాలుగు బోర్లు వేయించారు. రెండు బోర్లులో 2 ఇంచుల చొప్పున, మరొక బోరులో ఇంచున్నర చొప్పున నీరు పడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే బోర్లకు కొత్త మోటార్లు బిగించి గ్రామంలో నీటిని సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.

విజేత పీఆర్ పల్లె వృషభాలు



లంకాయపల్లిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బహుమతి దాతలు

తుగ్గలి: పెద్దమ్మవ్వ దేవత విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం లంకాయపల్లిలో నిర్వహించిన వృషభాల రాతిదూలం లాగుడు పోటీల్లో ప్యాపిలి మండలం పీఆర్‌పల్లె వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఊటకంటి అమరనాథ రెడ్డి, అశోక్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్ తదితరులు ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి మండల పీఆర్ పల్లె రంగనాయకులు వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో వడియంపేట లక్ష్మిరెడ్డి, మరుట్ల కృష్ణమూర్తి వృషభాలు (సంయుక్తంగా), మారెల్ల వడ్డె రమేష్ వృషభాలు, మల్యాల షేక్ మహబుస్నీ వృషభాలు, ఆలంకొండ మునిరంగడు, పెద్దొడ్డి స్వామినాయుడు వృషభాలు, ఉంగరానిగుండ్ల, వెంకటేశ్వర్లు, ఆలంకొండ వినయ్‌యాదవ్ వృషభాలు నిలిచాయి. విజేతలైన వృషభాల యజమానులకు వరుసగా బహుమతి దాతలు అమరనాథరెడ్డి రూ.30 వేలు, సుల్తాన్ రూ.20 వేలు, ఎఫ్ఏ రమేష్, రామాంజినేయులు రూ.15 వేలు, లింగన్న రూ.10 వేలు, ఆదినారాయణ, చంద్రశేఖర్, శీను, భాస్కర్, రాము, అరవ శీను రూ.7,500, ఆటో శేఖర్ రూ.5 వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

లంకాయపల్లిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మవ్వ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పురోహితులు మహాగణపతి పూజ, ప్రధాన కలశస్థాపన, అభిషేకాలు, దీక్షాహోమం, ప్రతిష్ఠామూర్తులకు జలాధివాసం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరెడ్డి దంపతులు పాల్గొన్నారు.